# నిలుపుకో నీ విలువ

"సుహాసినీ! ఇంకా రెడీకాలేదా? అబ్బబ్బా – ఎంతసేపా ముస్తాబు?!"

"వచ్చేస్తున్నానండీ! అయిపోయింది."

"పార్టీ మొదలయి అరగంటయింది. నేవచ్చేసరికి రెడీగా వుండమని చెప్పానా? నీ ముస్తాబయి అక్కడికి చేరేసరికి పార్టీ పూర్తయి, అంతా తిరుగుముఖాలు పడతారు. వెర్రిముఖాలేసుకుని వెళ్తున్నవాళ్ళకి ఎదురెడతామా?" అంటూ ఎగురుతున్న యాదవ్‌కి మరేం జవాబివ్వకుండా గబగబా బేగ్ తీసుకుని బైటికొచ్చింది సుహాసిని.

బైటికొచ్చిన సుహాసినిని చిరాగ్గా ఎగాదిగా చూశాడు యాదవ్. "ఏమిటా చీర? ఇంతకంటే పేదరంగుది దొరకలేదా? అయినా ఈ పంచరంగుల చీరలు తప్ప నీకు నచ్చవా? ఎక్కడ కొన్నారేమిటి దొరసానమ్మగారు?! ఆ పక్కింటి నిర్మలని చూడు – ఎంత చక్కటి చీరలు కడుతుందోను! రంగులవి కట్టినా ప్రింటెడ్‌వి కట్టినా ఎంత ప్లెజెంట్‌గా వుంటాయో చూసి నేర్చుకో. సెలక్షనంటే అలాగుండాలి. కట్టిన చీర మనిషికి అందాన్ని తేవాలి అంతేగానీ పిచ్చి ప్రింట్లు, ముదుర రంగులు మనిషి అందాన్ని చెడగొడతాయి. ఏం టేస్టో!! ఊ సరే పద ఇంక నీ అభిరుచి ఇంతే! ఈ జన్మలో మారవు. నేనెంత వాగినా ప్రయోజనం శూన్యం. చీర లేరుకోవడం కూడా ఒక కళే! ఓ మొద్దవతారానివి దొరికావు" అని సణుగుతూనే స్కూటర్ స్టార్ట్ చేశాడు యాదవ్.

ఎప్పటినుంచో సుహాసిని మనసులో వున్న కోరిక మైసూర్ సిల్కు చీర కొనుక్కోవాలను కున్నది, పండక్కి పుట్టింటికెళ్ళినప్పుడు అన్నగారూ, తండ్రీ ఇచ్చిన డబ్బుతో కొనుక్కుని తీర్చుకుంది. జరీ డాబుగా కనపడాలంటే ముదురరంగులే బాగుంటాయని కాస్త ముదురు రంగుది ఏరుకుంది. ఆ చీర చూసిన ప్రతీవాళ్ళూ ఎంతో బాగుందని మెచ్చుకున్నారు. పైగా తనేమంత నలుపు కాదుకదా? తనకీ నప్పుతుందనే భావనతో కూడా ఆ రంగు ఏరుకుంది. పెళ్ళయి రెండేళ్ళు కావస్తున్నా సరదాకి ఏనాడూ ఒక్క రవికల బట్టయినా కొనని భర్తకి తనవాళ్ళేం కొన్నా, తను కొనుక్కున్నా విమర్శించడం, వెటకారమాడటం మాత్రం బాగా చాతనవును.

ఇలా ప్రతీదానికీ హేళన చెయ్యడం తనకేం కొత్త కాదు. కానీ ఈ రోజన్నా తన చీర అందరిలాగే మెచ్చుకుంటాడని ఆశించిన సుహాసిని మనసు అతని మాటలకి బాగా దెబ్బతింది.

తన చీరని విమర్శించడంతోపాటు పొరుగువాళ్ళని పొగడటం మరీ బాధనిపించి, చిన్నబుచ్చుకున్న మనసుతో మౌనంగా వెళ్ళి స్కూటర్ వెనక కూర్చుంది.

యాదవ్ తోటి ఉద్యోగస్తుడి కూతురి తొలిపుట్టినరోజు పార్టీ. అతను యాభైమందిదాకా స్నేహితుల్ని పిలిచి పార్టీ ఇస్తున్నాడు. పార్టీ ప్రారంభమైన అరగంటకి యాదవ్, సుహాసినులు అక్కడికి చేరారు. సురేష్‌దంపతులు వారినెంతో ఆప్యాయంగా పలకరించి లోనికి తీసుకెళ్ళారు.

అట్టహాసంగా ఏర్పాటుచేసిన ఆ పార్టీలో రకరకాల స్వీట్లు, హాట్లూ పెట్టారు. డ్రింకులూ, టిఫిన్లూ, టీలూ అయ్యాకే అంతా ఒకచోట కూర్చుని పాటలు వచ్చినవారందరినీ పాడమని సురేష్ దంపతులు బలవంతం చెయ్యసాగారు. వెంటనే వచ్చినవారిలో కొందరు "మీ పాప పుట్టినరోజు గనక మీరే ముందు పాడా"లని సురేష్ భార్యని బలవంతం చెయ్యగానే "నాకు రావం"టూ తప్పించుకోబోయింది మాధవి.

ఆ వెంటనే సురేష్ అందుకుని "అవునోయ్ మాధవీ! నువ్వు పాడాకా వీళ్ళూ పాడతా" రన్నాడు ఆమె భుజం తడుతూ.

"నేనెప్పుడన్నా పాడానా? నన్ను పాడమని మీరంటారేమిటండీ" అంటూ సిగ్గుపడుతున్న భార్యతో –

"ఆ రావంటావేమిటి? పెళ్ళిచూపులనాడు 'నీకోసమె నే జీవించునదీ' అన్న పాట ఎంతో భావయుక్తంగా పాడావ్‌కదోయ్! పోనీ ఇప్పుడా పాటవద్దుగానీ, అదేదో కృతి... 'ఎంతవారలైనా కాంతదాసులే' అన్నది పాడు వింటాం" అనడంతో మాధవి భర్తవైపు కోపంగా చూస్తూ వీపుమీద ఓ గుద్దు గుద్దడం అంతా ఒక్కసారి ఘొల్లుమనడంతో అక్కడి వాతావరణం నవ్వుల వాన కురిసినట్లయింది.

అందరి బలవంతం మీద మాధవి సినిమా పాటొకటి ఓ చరణం పాడుతుంటే మధ్యలో సురేష్ కూడా బొంగురు గొంతుకతో పాటలోని మాటలు కొన్ని పాడి అందర్నీ నవ్వించసాగాడు. మాధవి ఆపగానే పాటలొచ్చిన వాళ్లచేత పాటలు పాడించసాగారు సురేష్ దంపతులు. రానివాళ్ళు జోక్సు చెప్పసాగారు.

అంతా అయ్యాక చివరగా సుహాసిని దగ్గరకొచ్చి "మీరూ పాడండి" అన్న సురేష్‌ని చూస్తూ "మా ఆవిడనా పాడమంటోంది? పార్టీ ఆఖర్ని అంతా చెప్పులేసుకున్నాక పాడితే బాగుంటుంది" అన్నాడు యాదవ్.

"సరే అదేదో మేం చూసుకుంటాం. కావాలంటే నువ్వు పరిగెత్తడానికి రెడీగా నిలబడు" అన్న సురేష్ మాటలకి మళ్ళీ అంతా ఘొల్లుమన్నారు.

అయినా యాదవ్ ఊరుకోకుండా "మా ఆవిడకి ఇలాంటి పార్టీల్లో పాడే పాటలు రావురా నాయనా! పూజలూ, పునస్కారాలు, పేరంటాళ్ళప్పుడూ పాడే అమ్మలక్కల పాటలు పాడమంటే బాగా వచ్చు. సినిమా పాటగానీ, లైట్‌సాంగ్‌గానీ రాదు. లేదా కడుపులో పోట్లొచ్చినదానిలా

శాస్త్రీయ సంగీతం అమ్మమ్మా! అబ్బబ్బా! అంటూ మెలికలు తిరుగుతూ పాడితే వినలేక మీరు బాధపడాలి. ఇంత ఆనందదాయకమైన వాతావరణాన్ని ఎందుకు పాడుచేస్తారు?" అన్న భర్త మాటలకి సుహాసిని అవమానంతో తల దించుకుంది.

కర్నాటక సంగీతం కొన్నేళ్ళపాటు కట్టుదిట్టంగా నేర్చుకుంది. భర్తకి ఆ సంగీతం ఇష్టం లేదని తెలిసిన దగ్గర నుంచి ఏనాడూ అతని ఎదురుగా గొంతెత్తి పాడలేదు. పెళ్ళి చూపులప్పుడు పాడిన పాటల్నే ఇప్పటికి వెక్కిరించి హేళన చేస్తూ వుంటాడు. అది ఇంట్లో ఇంట్లోకదా! అని సరిపెట్టుకుంది కానీ ఈనాడిలా నలుగుర్లో తన్నిలా అవమానం చెయ్యడం చాలా చిన్నతనమనిపించింది.

ఇప్పుడు పాడినవారిలో కొందరు కృతులు పాడినవాళ్ళు కూడా వున్నారు. తనకీ కొన్ని లలితగీతాలు వచ్చు. 'ప్రోత్సహించని భర్త ఎదుట ఎందుకు పాడాలి?' అన్న పట్టుదలతో తనకీ వచ్చునన్న విషయం ఎప్పుడూ చెప్పలేదు.

"ఛీ ఛీ – సురేష్‌కీ, యాదవ్‌కీ ఎంత తేడా! జోక్స్ వేసినా భార్యతో ఎంత సున్నితంగా ప్రవర్తించాడు. పాటరాని భార్యచేత పాడించి ఎంత ఆనందింపజేశాడు" అనుకుంది.

మౌనంగా కూర్చున్న సుహాసినిని మాధవి మరీ బలవంతం చెయ్యగా, "ఇక మేం బాధపడక తప్పేలా లేదు తియ్యవోయ్ ఓ రాగం" అని మళ్ళీ యాదవ్ గొప్ప జోకేసినట్లు అని నవ్వగానే కోపాన్ని మనసులో అణచుకుంటూ సభ్యతకోసం కృష్ణశాస్త్రిగారి గేయమొకటి మధురమైన కంఠంతో సుహాసిని పాడి ముగించగానే అంతా ఒక్కసారిలేచి చప్పట్లు కొడుతూ "వన్స్‌మోర్–వన్స్‌మోర్" అంటూ కేకలు పెట్టడంతో సుహాసిని కాస్త గర్వంగా, వెటకారంగా యాదవ్‌వైపు చూసి మరో పాట పాడటానికి గొంతు సవరించుకొంది.

"ఆగండాగండి" అంటూ సురేష్ లోపలినుంచి టేప్‌రికార్డర్ తెచ్చి ఆమె పాటని రికార్డు చేసుకున్నాడు. అక్కడికొచ్చిన వారంతా ఆమెచుట్టూ చేరి ఆమెని పొగడసాగారు.

"ఏరా అలా భయపెట్టేశావు! నీకు సంగీతజ్ఞానం లేదా లేక మీ ఆవిడ కంఠానికి దిష్టి తగుల్తుందనా?" అంటూ అడగడంతో యాదవ్ ముఖం పాలిపోయింది. కాస్త గంభీరంగా భార్యవైపు చూసి, మాటమార్చి వాళ్ళతో మరో విషయాన్ని చర్చించసాగాడు యాదవ్.

పార్టీ అయి ఇంటికొచ్చేవరకూ సీరియస్‌గానే వున్నాడు. లోపలికి అడుగెట్టగానే "నీకేం రోగమొచ్చింది? నా ఆఫీసువాళ్ళందరిలో నన్నలా అవమానం చేశావు? ఇంట్లో ఏనాడన్నా నీ ముఖం వేసుకుని ఒక్క లలితగీతం పాడి తగలడ్డావా? పెళ్ళిచూపుల నాటిలాగే ఈరోజు కూడా ఆ శాస్త్రీయమైన పాటొకటి ఏడవలేకపోయావా? నన్ను నలుగుర్లో చెంపదెబ్బ కొట్టినట్లు నీకు రావన్న పాటలు పాడి అవమానపర్చకపోతే!" అంటూ ఎగరసాగాడు.

"ఏ రోజన్నా ముచ్చటగా ఓ పాట పాడమని అడిగితే కదా తను పాడటానికి అయినా నన్ను నలుగుర్లో చేసిన అవమానంకన్నా తనెక్కువ అవమానపర్చిందా? తన తప్పులు తను

తెలుసుకొని, ఎదుటివారికి నీతులు చెప్తే బాగుండును" అని మనసులోనే అనుకుని, అతనితో వాదించడం ఇష్టంలేక బట్టలు మార్చుకునే వంకతో లోపలికెళ్ళిపోయింది సుహాసిని.

రానురాను సుహాసినికి భర్తను చూస్తుంటే "సైకిక్ గానీ కాదు కదా?" అన్న అనుమానం కలగసాగింది. సుహాసిని చేసే ప్రతీ పనినీ విమర్శించడం, వెటకారం ఆడటం దినచర్యతో పాటు అలవాటు చేసుకున్నాడు యాదవ్. ఇంట్లో ఏం వండినా వంకలు పెడుతూ, చిరాకుపడుతూ తినే యాదవ్ పొరుగింటివాళ్ళు ఏదన్నా పంపగానే ఆ వంటకాన్ని పొరుగువార్ని మెచ్చుకుంటూ, ఆనందిస్తూ తినడమే కాకుండా "నువ్వూ చేస్తావ్ దిక్కుమాలిన వంటలు - ఉప్పో, పులుపో ఎక్కువో, తక్కువో పడేసి - వెళ్ళి ఓసారి సుగుణ దగ్గర నేర్చుకుని సరిగ్గా వండి తగలేస్తే బాగుండును" అనేవాడు.

అంతేకాకుండా ఆమె ఏ మాటన్నా "కాద"నేవాడు, "కాద"న్నది "అవు"ననేవాడు. ఎడ్డమంటే-తెడ్డమనే భర్తతో విసిగిపోయిన సుహాసినికి ఏ పనిచెయ్యాలన్నా ఆసక్తి, ఉత్సాహం వుండేదికాదు. మెప్పు మెహర్బానీ లేని ఈ మనిషికి ఏం చేసినా, ఎంత చేసినా దండగే! అన్న అభిప్రాయం బలపడిపోయింది. మనిషి కష్టపడి చేసే పనిని ఆప్యాయతతో స్వీకరించి మెచ్చుకున్ననాడే ఆ వ్యక్తియందు గౌరవభావం పెరిగి, మరింత శ్రద్ధగా చెయ్యాలనిపిస్తుం దనుకునే స్వభావం సుహాసినిది.

భర్త ప్రవర్తనకి విసిగిపోయిన సుహాసిని యాంత్రికంగా ప్రతీ పనీ చేసిపడేసేది. అంతేకాకుండా భర్తపట్ల చులకనభావం, నిర్లక్ష్యం కూడా రోజురోజుకీ పెరిగిపోసాగింది.

దాంతో ఏ పనిచేసినా తన మనసుకి నచ్చి, తనకి తోచినట్లుగా చేసుకుపోయేది.

తన్ని లక్ష్యపెట్టటం లేదని గ్రహించిన యాదవ్, సుహాసిని మీద మరింత మండిపడి, ఎగరటం, అరవటం ఎక్కువ చేసుకున్నాడేగానీ తన తప్పు తెలుసుకుని సరిదిద్దుకొనే ప్రయత్నం మాత్రం చెయ్యలేదు.

టూర్ నుంచి వచ్చిన యాదవ్ సూట్‌కేస్‌లోంచి రెండు పత్రికలు తీసి "సుహాసినీ ఆ మేగ్జైన్సులో 'మల్లియ' అన్న రచయిత్రి కథలు పడ్డాయి చదువు. ఆ టాపిక్, భాష, శైలి, మాటల పొందిక - ఎంత చక్కగా వుందో చూడు - పెళ్లికి ముందేదో రెండు కథలు, నాలుగు కవితలు అచ్చయ్యాయని నీ బాబు పెళ్లిలో అందరితో చెప్పి నిన్నో గొప్ప రచయిత్రిగా పొగిడేసి గిరపోయేవాడు. కథలంటే ఎలా రాయాలో ఓసారి 'మల్లియ' రచనలు చదివి తెలుసుకో!" అంటూ ఆమె ఒళ్ళోకి విసిరాడు.

భర్తవైపు నిర్లక్ష్యంగా చూస్తూ ఆ పుస్తకాలని పక్కగా పెట్టి లేచి లోపలికెళ్ళిపోయింది సుహాసిని.

అది మొదలు యాదవ్ మల్లియ కథ పడ్డ ప్రతీ పత్రికా తెచ్చి చదవడమే కాకుండా, విన్నా వినకపోయినా సుహాసిని దగ్గర తెగపొగుడుతూ వుండేవాడు. ఆఖరికి మల్లియకి ఎంత ఫేన్

అయిపోయాడంటే ఎక్కడ, ఏ ఊళ్ళో వున్నా, ఆమె కథల్నీ, సీరియల్నునీ తప్పకుండా చదవడమే కాకుండా, ఆ పత్రికల్ని తెచ్చి జాగ్రత్తగా దాచుకునేవాడు. అతని మనసులో మల్లియయందు గౌరవభావాన్ని పెంచుకుని, ఆమె గురించి ఎంతో ఉన్నతంగా, అందంగా ఊహించుకునేవాడు. జీవితంలో ఒక్కసారి ఆమెని కలిసి ఆమె రచనల గురించి తనకున్న మంచిభావాన్ని వ్యక్తం చేయాలని అనుకునేవాడు.

ఆఫీసునుంచి హడావిడిగా వచ్చిన యాదవ్‌కి తలుపు తాళం వేసి వుండటం చూసి వంటికి కారం పూసినట్లయింది. 'ఎక్కడికి ఊరేగిందావిడ?' అనుకుంటూ పక్క వాటావాళ్ళని అడగటంతో "నాకు తెలీదండీ! మీరొస్తే తాళాలిమ్మన్నారంతే" అంటూ తాళాల గుత్తి చేతిలో పెట్టిందామె.

'మొగుడన్న గౌరవం, మర్యాదా బొత్తిగా లేకుండా పోయిందీవిడగారికి, బాగా పొగరెక్కిపోయింది' అని సణుక్కుంటూనే తాళంతీసి టిఫిన్ బాక్సులో పెట్టిన టిఫిన్ తిని ఫ్లాస్కులో పోసుంచిన కాఫీ తాగి, మధ్యమధ్యలో గడియారం చూసుకుంటూనే గబగబా డ్రెస్ మార్చుకుని స్కూటర్ స్టార్టుచేసి స్పీడుగా 'శకుంతల' ఆడిటోరియం వైపు పోనిచ్చాడు.

ఈ రోజు 'రసమాధురి' క్లబ్ మెంబర్సంతా కలిసి మల్లియకి సన్మానం చేస్తున్నారు. ఇన్నేళ్ళుగా ఆమె రచనల్ని చదవటమేగానీ, ఇంతవరకు ఆమెని చూడటం పడలేదు. జీవితంలో ఒకసారి ఆమెని కలవాలన్న కోరిక ఇంత త్వరగా తీరుతుందని అనుకోలేదు. టూర్ నుంచి వచ్చి ఉదయం ఆఫీసుకి వెళ్లగానే బల్లమీద రసమాధురివాళ్ళు పంపిన ఇన్విటేషన్ కార్డు వుంది. తెరిచి చూసి "మల్లియకి సన్మానం" అని చదవగానే ఆనందం పట్టలేక తారీకు చూశాడు. ఈ రోజే సాయంత్రం ఆరు గంటలకి ప్రోగ్రాము ప్రారంభమవుతుందని చదివినప్పటి నుంచి తెగ కంగారుగా వుందతనికి. సాయంకాలం అయిదుకల్లా పని ముగించుకొని ఇంటికొచ్చి భార్యతో సహా సన్మానానికి వెళ్ళాలని హడావిడిపడ్డ యాదవ్‌కి భార్య తాళం వేసుకుని బైటికెళ్ళడంతో సగం ఉత్సాహం పోయింది.

ఆమెని పరిచయం చేసుకుని, ఆటోగ్రాఫ్ తీసుకుని, ఆమె అంగీకరిస్తే ఇంటికి భోజనానికి పిలవాలని, ఆమె కథల్ని ఎంత జాగ్రత్తగా ఫైల్‌చేసిందీ చూపించాలనీ ఆశించాడు. సుహాసిని పక్కన లేకుండా ఆమెని తను ఇంటికి ఆహ్వానించడం సభ్యతకాదని గుర్తొచ్చి సుహాసిని మీద చిరాకు మరీ ఎక్కువయి, తిట్టుకున్నాడు. తన ప్లానంతా పాడుచేసినందుకు ఇంటికి రాగానే బుద్ధిచెప్పడమే కాకుండా, ఇక ముందు తనింటికొచ్చే టైముకి ఊసుపోని సోదికి అక్కడికీ, ఇక్కడికీ తిరగొద్దని బాగా చీవాట్లెయ్యాలనుకున్నాడు.

హడావిడిగా ఆడిటోరియంలోకి ప్రవేశించిన యాదవ్‌కి ఆడిటోరియం అంతా జనంతో నిండిపోయి వుండడం కనబడింది. వెతగ్గా, వెతగ్గా చివరగా ఓ ఖాళీ కుర్చీ కనబడగానే 'బ్రతుకు జీవుడా' అనుకుంటూ వెళ్ళి ఆ కుర్చీలో కూర్చున్నాడు. ఇంకా ప్రోగ్రాము ప్రారంభం కాలేదు. ఇంకా జనం వస్తున్నారు. చోటులేక గోడలపక్క నిలబడసాగారు. సాహితీసభకి అంతమంది

రావడం చాలా అరుదు. అన్ని పత్రికలలోనూ మల్లియ సీరియల్సు, కథలు రావడంతో ఆమె అభిమానులు దేశమంతా ఎక్కువవసాగారు.

రసమాధురి సంస్థవాళ్ళు బేడ్జిలు పెట్టుకుని హడావిడిగా అటూ, ఇటూ తెగ తిరుగుతున్నారు. వచ్చినవారికి చోటు చూపించలేక సతమతమౌతున్నారు.

సభాధ్యక్షులు వేదిక మీదకి వచ్చి తమ రసమాధురి గురించి, ఈ రోజు కార్యక్రమం గురించి మల్లియ గురించి రెండు మాటలు చెప్పి, మిగిలిన కార్యక్రమాన్ని కార్యదర్శి వివరిస్తారని చెప్పగానే అంతా చప్పట్లు కొట్టారు. కార్యదర్శి మరోమారు కార్యక్రమం గురించి చెప్పి ఈ రోజు ప్రఖ్యాత రచయిత్రి మల్లియని సన్మానించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని చెప్పి ఒక్క ఏడాది కాలంలోనే ఆమె రచనలు దేశంలో ప్రతీ ఒక్కరి మన్ననల్నీ అందుకుని, అందరి మనసుల్నీ అత్తుకుని అలరించాయంటూ ఆమె గురించి పొగిడి, ఈ సభకి ముఖ్య అతిథిగా రావడానికి అంగీకరించిన ముఖ్యమంత్రి గారి గురించి నాలుగుమాటలు చెప్పి, ఆయన్ని వేదిక నలంకరించమని కోరగానే ముఖ్యమంత్రి వేదిక పైకి వెళ్ళారు.

మల్లియ గురించి, ఆమె రచనల గురించి మాట్లాడటానికి వచ్చిన ప్రముఖ రచయిత లిద్దర్ని కూడా వేదికపైకి పిలిచిన తరువాత మల్లియ గార్ని ఆహ్వానించగానే హాలంతా చప్పట్లతో మారుమ్రోగడమే కాకుండా ఆమె గౌరవార్థం అంతా లేచి నిలబడ్డారు.

ఎదురుసీట్లో కూర్చున్న మల్లియ నెమ్మదిగా లేచి వెళ్ళి స్టేజి పైన ముఖ్యమంత్రి గారి పక్కన కూర్చోగానే హాల్లో జనమంతా తిరిగి తమ తమ కుర్చీల్లో కూర్చున్నారు.

చివరగా కూర్చున్నవాళ్ళంతా సగం లేచి, కళ్ళు పెద్దవి చేసుకుని ఆత్రంగా చూస్తున్నారు. యాదవ్ పరిస్థితి అలాగే వుంది. స్టేజి మీద వున్నవాళ్ళు సరిగ్గా ఆననట్లుగా అటూ యిటూ, లేచీ, కూర్చునీ చూస్తున్న యాదవ్ తలమీద ఎవరో గూటంతో బాదినట్లయి, కళ్ళు చీకట్లు కమ్మాయి. కారణం – స్టేజి మీద మంత్రిగారి పక్కన కూర్చున్న మల్లియ తన భార్య సుహాసిని కావడమే!!

కార్యక్రమం ఎలా జరుగుతోంది – ఎవరేం మాట్లాడుకున్నారు – అన్నవేమీ యాదవ్‌కి వినపడటంలేదు. గుడ్లప్పగించి, మతిపోయినవాడిలా సుహాసినినే చూస్తున్నాడంతే!!

సన్మానం ప్రారంభించగానే ముందుగా రసమాధురి వాళ్ళు మల్లియని శాలువాతోనూ, యాభైవేల రూపాయల పర్సుతోనూ సన్మానించారు. తరువాత ఆ ఊరిలోని వివిధ సంస్థల వాళ్లు పూలమాలలతోనూ, బహుమతులతోనూ సన్మానించసాగారు. సన్మాన కార్యక్రమం పూర్తికాగానే ముఖ్యమంత్రి లేచి మల్లియ ఈ ఊరి రచయిత్రే కావడం తమకి ఎంతో గర్వకారణ మని, ఆమె రచనల్లోని ప్రాముఖ్యతని వర్ణించి చెప్పారు. తరువాత మిగిలిన ఇద్దరు ప్రముఖ రచయితలు మాట్లాడతారని, చివరగా మల్లియగారు కూడా మాట్లాడతారని చెప్పగానే అంతా ఒక్కసారి చప్పట్లు కొట్టారు.

ఆ జనంలోంచి నెమ్మదిగా బైటికొచ్చిన యాదవ్ స్కూటర్ ఎక్కి తిన్నగా ఇంటికి చేరుకున్నాడు. ఏదో అనుమానం కలిగి ఆమె ట్రంకుపెట్టె తీసి గాలించాడు. అందులో ఆమె కథల కాంప్లిమెంటరీ కాపీలు, ఇంకా రాసి వుంచిన, రాస్తున్న కథలు, నవలలు కొన్ని కాకుండా ఆ ఊళ్ళో జరిగిన ఒకటి రెండు సన్మానసభల కార్యక్రమాల ఫోటోలు, బహుమతులు కూడా కనపడ్డాయి. మళ్ళీ ఎక్కడివక్కడ సర్దేసి ఇంటికి తాళంవేసి పక్కామెకిచ్చి రాత్రికి ఆలస్యంగా వస్తానని చెప్పి స్కూటరెక్కి వెళ్ళిపోయిన యాదవ్ మనసులో కోటానుకోట్ల ఆలోచనలు, సందేహాలు, ప్రశ్నలు. 'సుహాసిని ఎప్పుడు రాస్తుందీ కథలు, నవలలూ?? బహుశా తను టూర్లు తిరుగుతున్నప్పుడు, ఆఫీసుకెళ్ళినప్పుడు కావచ్చు!! కానీ ఇన్నాళ్ళూ తనకి తెలీకుండా ఇంతలా ఎలా దాచగలిగింది' అన్న ప్రశ్నకి మాత్రం జవాబు దొరకటంలేదు.

తన నిర్లక్ష్యం, చిన్నచూపు, విమర్శలు, వెటకారాలే సుహాసిని ఈ ప్రవర్తనకి కారణమని యాదవ్ మనసు నొక్కి, నొక్కి చెప్తున్నా – 'మగాడిని, అందునా మొగుడిని' అన్న అహం ఇంకా పోని, పోగొట్టుకోలేని యాదవ్ సుహాసినికి తను ఆమె సన్మానానికి వెళ్ళినట్లు తెలిస్తే ఎక్కడ లోకువయిపోతానో అన్న భావంతో 'దేముడా! నేనామె సన్మానానికి వెళ్ళిన విషయం రహస్యంగా వుంచు' అని మనసులోనే కోరుకుంటూ పార్కులోకెళ్ళి కూర్చున్నాడు. సుహాసిని ఇంటికి తిరిగొచ్చిన తరువాతగానీ తను వెళ్ళకూడదన్న భావంతో – పాపం సుహాసినే ఆ ఆహ్వానపత్రిక యాదవ్ ఆఫీసుకి పంపించిందన్న విషయం తెలియని యాదవ్.

**– స్వాతి వారపత్రిక, 16-4-1993**